## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలియజేశారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### ముగిసిన మజ్జిగ పంపిణీ

పెనమలూరు: తాడిగడప మునిసిపాలిటీలోని పోరంకిలో వాసవి క్లబ్ నవ నిర్మాణ్ కపుల్స్ 100 రోజులుగా చేస్తున్న మజ్జిగ పంపిణీ ఆదివారం ముగిసింది. క్లబ్ అధ్యక్షుడు కారంశెట్టి వెంకటమస్తానయ్య వివరాలు తెలుపుతూ వేసవి సందర్భంగా పోరంకిలో వాసవి క్లబ్ నవ నిర్మాణ్ కపుల్స్ ఆధ్వర్యాన సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. 100 రోజులుగా మజ్జిగ పంపిణీ చేశామన్నారు. మజ్జిగతో పాటు పుచ్చకాయ ముక్కలు, సుగంధి నీరు, పానకం, ఇతర పానీయాలు ప్రయాణికులకు అందించి దప్పిక తీర్చామన్నారు. ముగింపు కార్యక్రమంలో జిల్లా గవర్నర్ మాజేటి రామచంద్రరావు ప్రయాణికులకు మజ్జిగ అందజేశారు. క్లబ్ సభ్యులు లక్ష్మీదుర్గ, పెనుగొండ హారిక, కె.శైలజ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ఉచితంగా వైద్య పరీక్షలు

గన్నవరం: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడానికి వైద్య సంస్థలు ముందుకు రావాలని ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి పిలుపునిచ్చారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం పోరంకిలోని బ్రైట్ తల్లి పిల్లల వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత వైద్య శిబిరాన్ని జెడ్పీటీసీ ప్రారంభించారు. అనంతరం మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసిన డాక్టర్ బొమ్మరెడ్డి కార్తీక్‌రెడ్డి, దీప్తి దంపతులను ఎంపీపీ శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రజలకు ఉచిత వైద్యం అందించేందుకు ముందుకు వచ్చిన కార్తీక్‌రెడ్డిని అభినందించారు. అనంతరం పరిసర గ్రామాల నుంచి తరలివచ్చిన తల్లి, పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తుట్టగుంట సర్పంచ్ బొమ్మరెడ్డి కృష్ణారెడ్డి, పుర ప్రముఖులు బ్రహ్మరెడ్డి, రాధాకృష్ణరెడ్డి, బాలకృష్ణరెడ్డి, శ్రీదేవి పాల్గొన్నారు.

### రోటరీ అసిస్టెంట్ గవర్నర్‌గా అనీస్



ఉయ్యూరు: రోటరీ జిల్లా 3020 అసిస్టెంట్ గవర్నర్‌గా సయ్యద్ అనీస్ నియమితులయ్యారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయవాడలో జరిగిన కార్యక్రమంలో తనను అసిస్టెంట్ గవర్నర్‌గా నియమించారన్నారు. అంతర్జాతీయ రోటరీ అధ్యక్షుడి పిలుపు మేరకు ఈ ఏడాది రోటరీ క్లబ్‌లు పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలన్నారు. విద్య, వైద్యం, సామాజిక సేవ రంగాల్లో ఉయ్యూరు క్లబ్‌ను ముందుకు తీసుకెళ్తామన్నారు.

### నేడు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో స్పందన

విజయవాడరూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి రూరల్ మండల కార్యాలయంలో నిర్వహిస్తామని తహసీల్దారు పి.జాహ్నవిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను స్పందన కార్యక్రమంలో పాల్గొనే అధికారులకు అర్జీల ద్వారా అందచేయాలని కోరారు.

### పెనమలూరు మాజీ సర్పంచి మృతి

పెనమలూరు: పెనమలూరు మాజీ సర్పంచి బర్మావత్ బాలాజీనాయక్(35) మృతి చెందారు. బాలాజీ నాయక్ పెనమలూరు సర్పంచిగా 2013 నుంచి 2018 వరకు ఉన్నారు. ఆ తర్వాత ఆయన హైదరాబాద్‌కు వెళ్లి ప్రయివేటు ఉద్యోగం చేస్తున్నారు. అతనికి గుండె సంబంధిత వ్యాధి రావటంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అతని ఆరోగ్య పరిస్థితి విషమించటంతో ఆదివారం ఆస్పత్రిలో మృతి చెందారు. బాలాజీ నాయక్ మృతదేహాన్ని సోమవారం పెనమలూరుకు తీసుకువచ్చి అంత్యక్రియలు చేస్తారని గ్రామస్తులు తెలిపారు.

### 200 మందికి ఉచిత వైద్య పరీక్షలు

రామవరప్పాడు: లక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో లక్ష్మి పోలిక్లినిక్, డయాగ్నోస్టిక్ సెంటర్ ఆధ్వర్యంలో రామవరప్పాడు పీఎస్ఆర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఉచితంగా రక్త పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. లక్ష్మి ఫౌండేషన్ ప్రతినిధి సంపత్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. దీర్ఘకాలికవ్యాధులతో బాధపడుతున్న వారు క్రమం తప్పకుండా మందులు వాడాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నామమాత్రపు ఫీజులతో ఈసీజీ, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కాన్ వంటి పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, సర్పంచ్ వరి శ్రీదేవి, జెడ్పీటీసీ సువర్ణరాజు, గన్నవరం మార్కెట్ యార్డ్ చైర్మన్ అంజనీకుమారి, పేరంటాలమ్మ ఆలయ చైర్మన్ బోయిన భాను, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ సమ్మెట సాంబయ్య, పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు, సొసైటీ చైర్మన్ సాదం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# విద్యుత్ వెలుగులు

- కానూరు సబ్‌డివిజన్‌లో రూ.144 కోట్లతో పనులు
- రూ 21.20 కోట్లతో ఐదు సబ్‌స్టేషన్ల నిర్మాణం
- రూ 32.46 కోట్లతో రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు
- రూ 80.54 కోట్లతో జగనన్న కాలనీల్లో విద్యుదీకరణ


కానూరులో నిర్మించిన సబ్‌డివిజన్ కార్యాలయ భవనం

పెనమలూరు: రాష్ట్రంలో జగనమోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేస్తున్న విద్యుత్ సంస్కరణలు చక్కని ఫలితాలనిస్తున్నాయి. దీంతో నాణ్యమైన విద్యుత్ వినియోగదారుడికి సరఫరా జరుగుతోంది. అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేసి వ్యవసాయానికి ఇక్కట్లు రాకుండా చేశారు. గ్రామాల్లో విద్యుదీకరణ పనులు పూర్తికావడంతో విద్యుత్ వెలుగులు విరజిమ్మనున్నాయి. దీనికి తార్కాణం పెనమలూరు నియోజకవర్గంలోని కానూరు విద్యుత్ సబ్‌డివిజన్. ఇక్కడ నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం ఇప్పటివరకు రూ.144.29 కోట్ల నిధులు వెచ్చించింది. విద్యుదీకరణ పనులు పూర్తి కావటంతో గ్రామాల్లో ఇక విద్యుత్ వెలుగులు విరజిమ్మనున్నాయి. కానూరు సబ్‌డివిజన్‌లో పెనమలూరు, కంకిపాడు మండలాలతో పాటు తాడిగడప మునిసిపాలిటీ ఉంది. గ్రామాల్లో ఇళ్లకు 1,09,227, వాణిజ్య సముదాయాలకు 11,640 కనెక్షన్లు ఉన్నాయి. ఇవి కాకుండా పరిశ్రమలు, వ్యవసాయానికి, ఇతర ఉపయోగాలకు మొత్తం కానూరు సబ్‌డివిజన్‌లో 1,28,266 విద్యుత్ కనెక్షన్‌లు ఉండగా నెలకు ఆదాయం దాదాపు రూ.31 కోట్లు వస్తోంది.

**నాణ్యమైన విద్యుత్‌కు ఆధునీకీకరణ పనులు**

కానూరు సబ్‌డివిజన్‌లో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయటానికి ప్రభుత్వం ఇప్పటివరకు రూ.144.29 కోట్లు నిధులు వెచ్చించింది. వాణిజ్యం, గృహాలు, వ్యవసాయానికి లోఓల్టేజీ సమస్య లేకుండా మెరుగైన విద్యుత్ సరఫరా కోసం పనులు చేపట్టి పూర్తి చేశారు. ఇందులో భాగంగా ఐదు అత్యాధునిక సబ్‌స్టేషన్లను నిర్మించారు. వీటిలో ఒక సబ్‌స్టేషన్‌ను ప్రారంభించగా మిగిలిన నాలుగింటిని త్వరలో అందుబాటులోకి తేనున్నారు.

**రైతులకు రూ.32.46 కోట్లతో ట్రాన్స్‌ఫార్మర్లు**

సబ్‌డివిజన్ పరిధిలో పెనమలూరు, కంకిపాడు, తాడిగడప మునిసిపాలిటీ ఉన్నాయి. వీటి పరిధిలో ఉన్న 5,437 వ్యవసాయ కనెక్షన్లకు ప్రభుత్వం రూ.32.46 కోట్లు వినియోగించింది. లోఓల్టేజీ సమస్యల ఎదురుకాకుండా రైతులకు పగటి పూట విద్యుత్ సరఫరా చేయడానికి చర్యలు తీసుకున్నారు. దీనికి ప్రభుత్వం ట్రాన్స్‌ఫార్మర్లు సరఫరా చేసింది. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. పెనమలూరు మండలంలో 357, కంకిపాడు మండలంలో 476 ట్రాన్స్‌ఫార్మర్లను పంట పొలాల్లో ఏర్పాటు చేశారు. రూ 2.46 కోట్లతో 110 ఏజీఎల్ కనెక్షన్లు కొత్తగా ఇచ్చారు.




**రూ 7.63 కోట్లతో..**

రెండు మండలాల్లో మెరుగైన విద్యుత్ సరఫరాకు కోసం రూ 7.63 కోట్లు ఖర్చు చేశారు. కొత్తగా విద్యుత్‌లైన్లు, కండక్టర్లు, నూతన స్తంభాలు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఈ వేసవిలో ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా నివారించగలిగారు.


జగనన్న కాలనీలో విద్యుదీకరణ

**జగనన్న కాలనీలో రూ.80.54 కోట్లతో**

పెనమలూరు, కంకిపాడు మండలాల్లో జగనన్న కాలనీల్లో విద్యుత్ సరఫరాకు రూ.80.54 కోట్లతో పనులు చేపట్టారు. పెనమలూరు మండలంలో 10 వెంచర్లు, కంకిపాడు మండలంలో 30 వెంచర్లలో 30,259 మంది లబ్ధిదారుల విద్యుత్ అవసరాలకు పనులు వేగంగా చేస్తున్నారు. జగనన్న కాలనీలో నీటి సరఫరా, 11 కేవీ లైన్ల ఏర్పాటు, నూతన స్తంభాలు ఏర్పాటు చేశారు. ఈ కాలనీల్లో గృహప్రవేశాలు చేసిన వారికి కొత్త విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. ఇతర పనులను సుమారు రూ.3కోట్లతో చేస్తున్నారు.

**పోరంకి సెక్షన్ ఏర్పాటు**

మండల పరిధిలో విద్యుత్ వినియోగదారులు బాగా పెరగటంతో కొత్తగా పోరంకి విద్యుత్ సెక్షన్ ఏర్పాటు చేశారు. పోరంకి బీజేఆర్‌నగర్‌లో ఒక సబ్‌స్టేషన్ ఉండగా కొత్తగా కృష్ణాపురంలో సబ్‌స్టేషన్ నిర్మించారు. పోరంకి పరిధిలో 16 వేల విద్యుత్ కనెక్షన్లు ఉండటంతో కొత్తగా సెక్షన్ కృష్ణాపురంకాలనీలో ఏర్పాటు చేసి ఏఈగా సాంబశివరావును ఆదివారం నియమించారు. ఇక పెనమలూరు సెక్షన్‌తో పని లేకుండా పోరంకి సెక్షన్ పని చేస్తుంది.


రైతులకు ప్రభుత్వం సరఫరా చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు(ఫైల్)


నాణ్యమైన విద్యుత్‌కు మెగా ఓల్టేజ యాంపియర్ ట్రాన్స్‌ఫార్మర్

**కానూరు సబ్‌డివిజన్‌కు ప్రత్యేక గుర్తింపు**

జిల్లాలో కానూరు సబ్‌డివిజన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. విద్యుత్ వినియోగంతో పాటు, సకాలంలో రెవెన్యూ కలెక్షన్ ఉంటుంది. విద్యుత్ చౌర్యం పూర్తిగా నివారించారు. మూడేళ్లుగా విద్యుత్ వినియోగదారులకు ఐఆర్‌డీఏ పద్ధతిలో బిల్లింగ్ ఇస్తున్నారు. కానూరు సబ్‌డివిజన్ ఉన్నత సేవలకు నాలుగు సార్లు ఉత్తమ సేవా అవార్డు కూడా వచ్చింది. సిబ్బంది ఉత్తమ పనితీరుతో కానూరు సబ్‌డివిజన్ సేవలు విస్తృతంగా ఉన్నాయి.

**నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం**



అన్ని ప్రాంతాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయటానికి ఆధునికీకరణ పనులు చేశాం. ప్రధానంగా కానూరు, పోరంకిలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంది. పోరంకి ప్రభునగర్‌లో మరో సబ్‌స్టేషన్ నిర్మాణానికి కృషి చేస్తున్నాం.

–ఎం.పూర్ణచంద్రరావు, డిప్యూటీ ఈఈ, కానూరు సబ్‌డివిజన్

### ఆస్పత్రులకు వెళ్లి పింఛన్ అందజేత



గన్నవరం రూరల్: వలంటీర్‌ల సేవలకు ప్రశంసలు లభిస్తున్నాయి. ముస్తాబాద సచివాలయంలో వలంటీర్‌గా పని చేస్తున్న కలపర్తి సారిక విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ పేషంట్‌గా చికిత్స పొందుతున్న కొండపాటూరి శ్రీనివాసరావుకు ఆదివారం రూ.10వేలు పెన్షన్ అందజేశారు. శ్రీనివాసరావు చికిత్స పొందుతున్న విషయం తెలిసిన వలంటీర్ స్వయంగా వెళ్లి పింఛను అందజేయటంతో ఆమెను సర్పంచ్ వి.రాధాకృష్ణ, కార్యదర్శి కె.లక్ష్మీ, సచివాలయం వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ జె.నానారావు, గ్రామస్తులు అభినందించారు.

**విజయవాడ వెళ్లి..**



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధి తాడిగడప సచివాలయంలో కార్మికనగర్ 2లో ఉంటున్న నందం రామకృష్ణ తీవ్ర అనారోగ్యంతో విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సమాచారం తెలుసుకున్న తాడిగడప సచివాలయం 2 వలంటీర్ ఎ. విజయకుమారి ఆదివారం ఆస్పత్రికి వెళ్లి రామకృష్ణకు పింఛన్ అందజేశారు. కష్టకాలంలో వలంటీర్ వచ్చి పింఛన్ సొమ్ము అందించారని రామకృష్ణ తెలిపారు.

**ఉంగుటూరులో 92 శాతం పింఛన్ల పంపిణీ**

ఉంగుటూరు: మండల వ్యాప్తంగా 7928 మంది పింఛను లబ్ధిదారులకుగాను 7335 మందికి అందించి 92 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. ఉంగుటూరులో జరుగుతున్న పింఛను పంపిణీని ఎంపీడీవో ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛను నగదు ఏ నెలకు ఆనెల మంజూరు చేస్తున్నారని తెలిపారు. ఈ నెలలో పింఛను తీసుకోని వారికి వచ్చే నెలలో అందిస్తారని చెప్పారు. ఒక ప్రాంతం నుంచి వేరొక ప్రాంతానికి వెళ్లినవారు ఆయా గ్రామ సచివాలయంలో తెలియజేస్తే ఆ ప్రాంతంలో పింఛను అందజేస్తారని పేర్కొన్నారు. అనంతరం సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు పలు సూచనలు చేశారు.

## రాష్ట్రంలో జనరంజక పాలన


ఉయ్యూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: జన రంజక పాలనతో ప్రజా జీవితాల్లో సంక్షేమ వెలుగు నిండిందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. పట్టణంలోని 12వ వార్డులో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి కాలేజీ రోడ్డు, సుందరంపేట రోడ్లలో ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని సంక్షేమ బ్రోచర్లను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు డ్వాక్రాలో సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. మహిళలు చెప్పిన సమస్యలపై మెప్మా అధికారి వెంకయ్యతో సమీక్షించి పరిష్కారానికి ఆదేశించారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జనం సంతోషంగా ఉన్నారన్నారు. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ఉద్దేశపూర్వకంగా అసత్యాలు ప్రచారం చేసి ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా జనం సీఎం జగనన్న వెంటే ఉన్నారని స్పష్టం చేశారు. మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, ప్రభుత్వాసుపత్రి చైర్మన్ జంపాన కొండలరావు, 12వ వార్డు ఇన్‌చార్జి అడపాక రాంబాబు, కోఆప్షన్‌సభ్యురాలు అడపాక ఆదిలక్ష్మి, కౌన్సిలర్లు కూరాడ వెంకటలక్ష్మి, డాక్టర్ జంపాన పూర్ణిమ, గుంజా సుధాకర్, రాజులపాటి చిన్ని, ఫైలా శ్రీనివాసరావు, పార్టీ పట్టణ ప్రధానకార్యదర్శి అబ్దుల్ సద్దాం, షాదీఖానా కమిటీ చైర్మన్ అహ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు. తొలుత శివాలయంలో ఎమ్మెల్యే పార్థసారథి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఘనంగా శాకంబరీ ఉత్సవం


శాకంబరిదేవికి పూజలు చేస్తున్న అర్చకులు


కంకిపాడులో..

దావాజీగూడెం(గన్నవరం): మండలంలోని దావాజిగూడెంలో వేంచేసియున్న సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం శాకంబరీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ఆలయంలోని సరస్వతిదేవి అమ్మవారిని శాకంబరి దేవిగా అలంకరించారు. అమ్మవారితో పాటు ఆలయ ప్రాంగణాన్ని పలు రకాల కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో భక్తులచే కుంకుమార్చనలు నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు ఎన్. రామాచార్యులు ఆధ్వర్యంలో సరస్వతిదేవికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు కదంబం ప్రసాద వితరణ చేశారు.

**శాకంబరిగా వాసవీకన్యకాపరమేశ్వరి**

కంకిపాడు: పట్టణంలోని ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు ఆదివారం శాకంబరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

## రైతులను గందరగోళానికి గురిచేయొద్దు

**కృష్ణా జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి**

కంకిపాడు: వాస్తవ దూర కథనాలతో రైతులను గందరగోళానికి గురిచేయటం సరికాదని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.పద్మావతి హితవు పలికారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. దయలేదు...దగానే అన్నదాతకు శీర్షికన మరోసాయి మొండి చెయ్యి వైఎస్సార్ బీమా అమలు నామమాత్రమే సారాంశంతో ఆదివారం ఓ పత్రికలో(సాక్షి కాదు) ప్రచురితమైన కథనాన్ని ఖండించారు. ఆ కథనం పూర్తిగా వాస్తవదూరంగా ఉందని తెలిపారు. మూడేళ్లుగా డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం ఫలాలు అందుకుంటున్న రైతులను అయోమయంలో పడేసేలా ఉందని పేర్కొన్నారు. గ్రామం యూనిట్‌గా పంట కోత ప్రయోగాలలో నమోదైన దిగుబడి ఆధారంగా బీమా లెక్కించామని పేర్కొన్నారు. హామీ దిగుబడి కన్నా వాస్తవ దిగుబడి తగ్గిన చోట మాత్రమే బీమా వర్తిస్తుందని తెలియజేశారు. వాస్తవ దిగుబడి కృత్తివెన్ను మండలం నీలిపూడిలో తక్కువగా ఉండటంతో ఈ క్రాప్, ఈకేవైసీ పూర్తయిన 495.93 ఎకరాల్లో 234 మంది రైతులకు రూ 57.44 లక్షలు బీమా క్లెయిమ్ ఈనెల 8న ఖాతాల్లో జమవుతుందని తెలిపారు.

### అట్రాసిటీ కేసు నమోదు

కంకిపాడు: సమాధులు కూల్చివేత ఘటనపై కంకిపాడు పోలీసుస్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్టు కింద ఆదివారం కేసు నమోదైంది. అదనపు ఎస్ఐ జె.లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుందేరు గ్రామానికి చెందిన పీకా మరియమ్మకు కుందేరు కాలనీ నుంచి ఊరులోకి వెళ్లే మార్గంలో కొంత భూమి ఉంది. ఆ భూమిలో ఉన్న మూడు సమాధులను గుర్తుతెలియని వ్యక్తులు ఈనెల ఒకటో తేదీ ధ్వంసం చేశారు. సమాధులతో పాటుగా వాటిపై ఉన్న గుర్తులను ధ్వంసం చేసినట్లు బాధితురాలు మరియమ్మ కంకిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్టు కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మి తెలిపారు.

### నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి



గన్నవరం: పోలవరం నిర్వాసితుల సమస్యలపై సీపీఎం చేపట్టిన మహాపాదయాత్ర ఆదివారం రాత్రి గన్నవరం చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ...పోలవరం పూర్తయితే 193 గ్రామాలు ముంపు బారినపడతాయని చెప్పారు. జాతీయ ప్రాజెక్ట్ పోలవరం పునరావాసం కేంద్ర ప్రభుత్వానిదేనని చెప్పారు. పోలవరం ప్రాజెక్టుకు రూ. 33 వేల కోట్లు ఇవ్వవాల్సి ఉండగా మోదీ ప్రభుత్వం కేవలం రూ. ఏడున్నర వేల కోట్లు మాత్రమే ప్రకటించడం దారుణమన్నారు. పార్టీ నాయకులు ఆర్. రఘు, వై. నరసింహారావు, మల్లంపల్లి ఆంజనేయులు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

■ హనుమాన్‌జంక్షన్ రూరల్: పాదయాత్ర ఆదివారం బాపులపాడు మండలంలో కొనసాగింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, సీహెచ్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

### కోడి పందేల శిబిరంపై దాడి

కంకిపాడు: కోడి పందేల శిబిరంపై పోలీసులు ఆదివారం దాడులు చేశారు. కంకిపాడు అదనపు ఎస్ఐ జె.లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం ఈడ్పుగల్లు పరిధిలో ఖాళీ ప్రదేశంలో కోడిపందేలు ఆడుతున్నట్లు సమాచారం అందింది. పోలీసులు ఆ ప్రాంతంపై దాడి చేశారు. నలుగురు పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి కోడి పుంజు, రూ.5600 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మి తెలిపారు.

### అత్తింటివారిపై వరకట్నం వేధింపుల కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు సనత్‌నగర్ రామాలయం ప్రాంతానికి చెందిన ఎండీ రేణుక బిహార్‌కు చెందిన జావేద్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు. గత అక్టోబర్‌లో రేణుక మామ చనిపోవటంతో భార్యభర్త, పిల్లలు బిహార్ వెళ్లారు. అక్కడకు వెళ్లిన తరువాత భర్తతోపాటు అత్త అజ్మిరాకతున్, మరిది బనేష్ కట్నకానుకలు తీసుకురావాలని వేధించారు. గత నెల 16న భర్తతో రేణుక సనత్‌నగర్‌కు వచ్చింది. భర్త రేణుకను వదిలి తిరిగి బిహార్‌కు వెళ్లి పోయాడు. ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో వారు అత్తింటివారిపై వరకట్నం వేధింపుల కేసు నమోదు చేశారు.

### దాడి ఘటనపై కేసు

పెనమలూరు: యనమలకుదురులో వ్యక్తిపై మరో వ్యక్తి దాడి చేయడంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు డొంక రోడ్డుకు చెందిన షేక్ షబ్బీర్ ఆటోనగర్‌లో కార్పెంటర్ పనులు చేస్తుంటాడు. అదే గ్రామానికి చెందిన కన్నా సునీల్.. షబ్బీర్‌ను గత నెలలో హైదరాబాద్‌లో పని ఉందని తీసుకెళ్లాడు. ఆ తరువాత సొమ్ము ఇవ్వకపోవడంతో షబ్బీర్ తిరిగి పదిరోజుల క్రితం యనమలకుదురుకు వచ్చేశాడు. ఆ తరువాత సునీల్ వచ్చి రూ 9 వేలు షబ్బీర్‌కు ఇచ్చాడు. ఈ నెల 1వ తేదీన షబ్బీర్ యనమలకుదురు బార్ వద్ద ఉన్న సమయంలో సునీల్ వచ్చాడు. మద్యానికి సొమ్ము లేదని సునీల్ చెప్పటంతో షబ్బీర్ రూ.1400 సొమ్ము ఇచ్చాడు. సునీల్ మద్యం సేవించిన తరువాత షబ్బీర్‌తో గొడవకు దిగాడు. అందరి ముందు తనను సొమ్ము అడిగి పరువు తీస్తావా అని సునీల్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ షబ్బీర్‌పై దాడి చేశాడు. ఘటనపై ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

## అమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ


అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించిన బ్రాహ్మణ పరిషత్ సభ్యులు


అమ్మవార్లకు సారె సమర్పించేందుకు వస్తున్న మహిళలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం రంగయ్య అప్పారావుపేటలోని గ్రామ దేవతకు సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆషాఢం సారె ఘనంగా సమర్పించారు. అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారికి సారె తీసుకుని మేళతాళాలతో ప్రదర్శనగా ఆలయానికి విచ్చేశారు. జై దుర్గా నామస్మరణతో రామాలయం నుంచి గంగానమ్మ తల్లి దేవస్థానం వరకు ప్రదర్శన నిర్వహించారు.

అనంతనం గంగానమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, సారె సమర్పించారు. సమరసత సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ ఎదురువాడ శ్రీనివాసరావు, ధర్మ ప్రచారక్ యడ్లపల్లి పాండురంగారావు, మండల కమిటీ సభ్యులు జింకా నానిబాబు పాల్గొన్నారు.

**కనకదుర్గమ్మ ఆలయంలో..**

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి శివారు దుర్గాపురంలోని కనకదుర్గమ్మ ఆలయంలో ఆదివారం బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు. తొలుత పెద్ద సంఖ్యలో తరలివచ్చిన బ్రాహ్మణ పరిషత్ సభ్యులు అమ్మవారి సన్నిధిలో శ్రీలలితా సహస్రనామ పారాయణం, వేద పఠనం చేశారు. అనంతరం బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు పన్యారం విష్ణుమూర్తి నేతృత్వంలో అమ్మవారికి ఆషాఢ సారె, పండ్లు, పూలు సమర్పించారు. పరిషత్ సభ్యులు కప్పగంతు లక్ష్మణ శాస్త్రి, గోపరాజు సత్యపవన్‌కుమార్, మామిళ్లపల్లి వెంకట సుబ్బారావు, తిమ్మరాజు వెంకటసుబ్బారావు వకుళ, శేషుకుమార్ పాల్గొన్నారు.

**కన్యకాపరమేశ్వరికి**

రామవరప్పాడు: వాసవీ సేవా సంఘం వారి గ్రామ దేవత కన్యకా పరమేశ్వరి అమ్మవారికి, వెంకమ్మ పేరంటాలమ్మకు ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు. కాల్వకట్ట ప్రాంతం హనుమాన్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆర్యవైశ్య మహిళ భక్తులు ఊరేగింపుగా తరలివచ్చి సారె సమర్పించారు.

### ఎన్నికల అధికారిగా సత్యనారాయణరెడ్డి

విజయవాడరూరల్ : ది వీటీపీఎస్ ఆఫీసర్స్ కోఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ ఎన్నికలకు కోఆపరేటివ్ అసిస్టెంటు రిజిస్ట్రార్ డి.సత్యనారాయణరెడ్డిని ఎన్నికల అధికారిగా ఆ శాఖ నియమించింది. ఈ నెల 16వ తేదీన ఇబ్రహీంపట్నంలో వీటీపీఎస్ అసోసియేషన్ కాలనీలో ఎన్నికలు నిర్వహిస్తామని సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేయదల్చిన వారు మిగతా వివరాల కోసం ఎన్నికల అధికారిని సంప్రదించాలన్నారు.